ప్రజాశక్తి
బుధవారం 8 మే 2024 పేజీలు 8



విజయనగరం




పార్వతీపురం మన్యం

ఉద్యోగులకు వల

● పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం అభ్యర్థుల పాట్లు

● పార్వతీపురంలో నగదు పంపిణీ




సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగుల ఓట్లు తీవ్ర ప్రభావం చూపనున్న నేపథ్యంలో వారి ఓట్లు ఎలాగైనా పొందేందుకు వైసిపి, టిడిపి అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభం కావడంతో ఉద్యోగులకు వల వేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, కాంట్రాక్టు సిబ్బందికి, అంగన్‌వాడీలకు ఓటు హక్కును ముందుగానే వినియోగించుకు అవకాశాన్ని కల్పించడంతో జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఈనెల 5 నుంచి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభమైంది. ఉద్యోగులకు వేసేందుకు వైసిపి, టిడిపి అభ్యర్థులు తొలి నుంచీ ప్రయత్నాలు ప్రారంభించారు. ఆత్మీయ సమావేశాలు పేరిట పార్టీలు ఏర్పాటు చేసిన పార్టీలు తాజాగా డబ్బులు ఎర చూపుతున్నాయి. అధికార వైసిపి నాయకులు తమ పార్టీకి ఓటు వేయాలని ఉద్యోగులకు డబ్బులు ఆశ చూపుతున్నారు. అయితే చాలా మంది ఉద్యోగులు తిరస్కరిస్తున్నట్లు తెలిసింది.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/పార్వతీపురం రూరల్

పార్వతీపురం నియోజకవర్గంలో 1751మంది ఓటర్లు ఉన్నారు. వీరు కాకుండా అంగన్‌వాడీలను, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా పోస్టల్ బ్యాలెట్ లభించింది. వీరిని లక్ష్యంగా చేసుకున్న అధికార వైసిపి నాయకులు డబ్బులతో ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఎన్నికల్లో పాల్గొనే వారి జాబితాను ముందుగానే సేకరించి వారిని తమ అనుయాయులతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మాట్లాడి ఒక్కో ఓటుకు రూ.2వేలు నుంచి, రూ.5వేలు వరకూ అందజేస్తున్నట్లు సమాచారం. పార్వతీపురం, సీతానగరం మండలంలోని (మిగతా..3లో)



ఓటు వేసేందుకు బారులు తీరిన ఉద్యోగులు



కురిసింది వాన

చల్లబడిన వాతావరణం ● ఊపిరి పీల్చుకున్న జనం

ప్రజాశక్తి-విజయనగరం

గత కొన్ని రోజులుగా తీవ్ర ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరటనిచ్చింది. మంగళవారం వరుణుడి రాక ఉపశమనం కలిగించింది. నాలుగు రోజులుపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచించింది. ఈనేపథ్యంలో వేకువ జాము నుంచి జిల్లా అంతటా అక్కడక్కడా స్వల్పవర్షాలు, కొన్ని చోట్ల చిరుజల్లుల పడడంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేశారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 14.5 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యధికంగా జామి మండలంలో 37.4మి.మీ, అత్యల్పంగా వంగర మండలంలో 2.2 మి.మీ, వర్షం కురిసింది. పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో మామిడి కాయలు నేల రాలాయి. వేపాడ మండలంలో 35.2మి.మీ, శృంగవరపుకోటలో 23.8, రాజాంలో 19.4, విజయనగరంలో 18.8, లక్కవరపుకోటలో 18.6, మెరకముడిదాం 18.2, భోగాపురం 17.4, గజపతినగరం 17.2, కొత్తవలసలో 16.4, గంట్యాడలో 15.2, బొబ్బిలిలో 15.2, దత్తిరాజేరులో 12.8, నెల్లిమర్ల 12.4, తెర్లాం 11.6, గరివిడి 10.8, రామభద్రపురం 10.6, చీపురుపల్లి 10.2, గుర్ల 8.8, సంతకవిటి 8.6, బాడంగి 8.2, మెంటాడ 7.4, బొండపల్లి 7.2, పూసపాటిరేగ 6.2, రేగిడి ఆముదాలవలస 4.2, వంగర మండలంలో 2.2మి.మీ. వర్షం కురిసింది.

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలో ఈదురుగాలులకు గోరటి గ్రామంలో రెండు ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. సీతంపేటలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది.

చిరుజల్లులతో వర్షం.. ప్రజల్లో హర్షం

బొబ్బిలి పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో తెల్లవారుజామున చిరుజల్లులతో వర్షం కురిసింది. వర్షంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో పూల్ బాగ్ రోడ్డు చెరువును తలపించింది. రోడ్డుపై ఉన్న గోతులలో వరదనీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూల్‌బాగ్ రోడ్డును బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి

ప్రజాశక్తి-సీతానగరం/కొమరాడ

నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. పుణ్యవతి కోరారు. ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను, కురుపాం అసెంబ్లీ అభ్యర్థి మండంగి రమణను గెలిపించాలని కోరుతూ మంగళవారం కొమరాడ మండలంలోని కళ్లికోట, దుగ్గి గ్రామాల్లోను, సీతానగరం మండలంలోని తామరకండి, బగ్గందొరవలస, గెడ్డలుప్పి, బూర్జ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలకు ప్రజా సమస్యలు పట్టడం లేదని అన్నారు. దేశ సంపదను బిజెపి ప్రభుత్వం కార్పొరేట్‌లకు కట్టబెడుతుంటే వైసిపి, టిడిపిలు మద్దతిస్తున్నాయని తెలిపారు. సిపిఎం పోరాట ఫలితంగానే ఉపాధి (మిగతా..3లో)

యువతకు భరోసా ఇస్తాం

విశాఖను ఐటి రాజధాని చేస్తాం ● యువగళం సభలో లోకేష్

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు ఉపాధి, ఉద్యోగాలకు భరోసానిస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. విశాఖను ఐటి రాజధానిగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. నగరంలోని అయోధ్య మైదానంలో మంగళవారం నిర్వహించిన యువగళం ఎన్నికల ప్రచార సభలో లోకేష్ పలువురు విద్యార్థులు, యువత అడిగిన ప్రశ్నలకు సమాధానిలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగించి ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖపట్టణాన్ని ఐటి రాజధానిగా తీర్చి దిద్దుతామని తెలిపారు. అధికారంలోకి వచ్చాక మూడునెలలకే జగన్ మూడు ముక్కలాట వెంందలెట్టారని అన్నారు. రుషికొండకు గుండుకొట్టి ఒక్క వ్యక్తి బతకడానికి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నారని, ఆ డబ్బుతో విజయనగరం జిల్లాలో పేదలందరికీ ఇళ్లు నిర్మించే అవకాశం ఉండేదని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించి రుషికొండలో కట్టిన ప్యాలెస్ కు కేంద్రం రూ.200 కోట్ల పెనాల్టీ కూడా విధించిందన్నారు. మొత్తం 700 కోట్లు దుర్వినియోగం చేశారు. భవనాలను కూల్చడం టిడిపి బ్లడ్‌లో లేదని, చంద్రబాబుకు కట్టడమే తెలుసు, కూల్చడం తెలియదని తెలిపారు. రుషికొండ ప్యాలెస్‌ను కూడా ప్రజల అవసరాలకే వినియోగిస్తామని తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఉత్తరాంధ్రలో ఒక్క పరిశ్రమ గానీ, ఒక్కరికి ఉద్యోగం గానీ వచ్చిందా? అని ప్రశ్నించారు. ఎక్కడ చూసినా భూకబ్జాలు, దోపిడీలు, ఇసుక, గంజాయి, డ్రగ్స్ మాఫియాలు, హత్యలు పెరిగిపోయాయని అన్నారు.



యువతతో కరచాలనం చేస్తున్న లోకేష్



యువగళం సభలో మాట్లాడుతున్న నారా లోకేష్, చిత్రంలో ఎమ్‌పి, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, అదితి

కుటుంబసభ్యులే వైసిపి నేతలను నమ్మడంలేదు

జగన్ ఒక బిల్డప్ బాబాయి అని, వెయ్యికోట్ల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టి నువ్వే మా నమ్మకం అని బోర్డులు (మిగతా..3లో)



శేషగిరి చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

శేషగిరికి ఘన నివాళి

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురంలో యుటిఎఫ్ పూర్వ నాయకులు శేషగిరి మూడో వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ పరంగా శేషగిరి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.ప్రసాదరావు, పూర్వ ప్రెసిడెంట్ ఇ.రాములప్పుడు, మండల ప్రధాన కార్యదర్శి ఎ.వైకుంఠరావు, కె.శ్రీనివాస్ బెహరా, కోట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లకు సీలు

ప్రజాశక్తి-పార్వతీపురం

చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సూచనల మేరకు 01- అరకు (ఎస్‌టి) పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుండి అందుతున్న సర్వీస్ ఓటర్లకు సంబంధించిన అన్ని ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ (ఇటిపిబి)ల బ్యాలట్ బాక్స్ (ట్రంక్ పెట్టె)కు అరకు పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నిశాంత్ కుమార్ 01- అరకు పార్లమెంటరీ నియోజకవర్గంలో పోటీ చేసే రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో మంగళవారం సీలు వేశారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ జి.కేశవనాయుడు పాల్గొన్నారు.



జోడుమెరకలో ప్రచారం చేస్తున్న కోళ్ల లలితకుమారి

గ్రామాల్లో కోళ్ల ప్రచారం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలో జోడుమెరక, తమన్నమెరక, అప్పన్నదొరపాలెం, మమ్మనవానిపాలెం, రెల్లి, కొత్త సుంకరపాలెం, దత్తి, దన్నన్నపేట, అప్పన్నపాలెం, గాంధీనగర్, ఉత్తరాపల్లి, రాయపురాజుపేట, చిన్ని పాలెం, జోగయ్యపాలెం, సింహాద్రిపాలెం, అడ్డూరువారిపాలెం, నిమ్మలపాలెం గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి సూపర్‌సిక్స్ పథకాలను వివరించి, ఓట్లడిగారు.

జోరుగా వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం పంచాయతీలో వైసిపి నాయకులు మంగళవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. జగన్మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని అన్నారు. అలాగే ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును కూడా గెలిపించుకుంటే పంచాయతీ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. నాయకులు పడాల శ్రీనివాసరావు, కొమ్మూరు సుభోసనరావు, సుందర హరీష్, పడాల భాను, ఆళ్ల ఉదయ బాబు, ఇమ్మిడిశెట్టి ప్రసాద్, బొల్లు గాంధీ, బొడ్డ భాస్కర్, లాయర్ గుర్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికి గుదిబండ... డంపింగ్ యార్డ్

చెత్త సమస్యపై పాలకులకు కొరవడిన చిత్తశుద్ధి



అంతర్‌రాష్ట్ర రహదారి పక్కనున్న డంపింగ్‌యార్డు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

శాసనసభ నియోజకవర్గ కేంద్రమైన పార్వతీపురం మున్సిపాల్టీ జిల్లా కేంద్రంగా ఉంది. ఇంత ప్రాధాన్యత గల పార్వతీపురం పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో డంపింగ్ యార్డ్ సమస్య మొదటిది. గత 20 ఏళ్లుగా ప్రభుత్వాలు మారుతున్నాయి, శాసనసభ్యులు మారుతున్నారు, మున్సిపల్ చైర్‌పర్సన్లు మారుతున్నారు కానీ డంపింగ్ యార్డ్ సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణానికి ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి ఎవరు ప్రవేశించినా పట్టణ ముఖ ద్వారంలోనే ముక్కు మూసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. సమస్య పరిష్కరిస్తామని ప్రజలకు హామీలిచ్చి అధికారంలోకి వస్తున్నారు. కానీ గెలిచిన వెంటనే ఆ హామీలను చెత్తలోనే కలిపేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణంలో 62వేలు చెబుతున్నప్పటికీ ఈ 15 ఏళ్లలో లక్ష దాటి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ అసెస్మెంట్లు ప్రకారం 13వేల ఇళ్లు ఉన్నట్లు చెప్తున్నారు. కానీ వాస్తవానికి 20వేల ఇళ్లు దాటి ఉంటాయి. ప్రతిరోజూ పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లోనూ 25 టన్నుల వ్యర్థపదార్థాలు సేకరిస్తున్నారు. దీన్ని బట్టి నెలకు ఎంత చెత్త పోగవుతుందో ఊహించుకోవచ్చు. ప్రజలకు మఖ్యపెట్టి తడి, పొడి అనే నినాదంతో చెత్తను సేకరిస్తున్నప్పటికీ తడి చెత్తను ఎరువులుగా, పొడిచేతను ఆదాయ వనరుగా మార్చుకునే వ్యవస్థ లేకపోవడంతో పార్వతీపురం పట్టణ శివారులో గల రాయగడ రోడ్డులోనే డంప్ చేస్తున్నారు. దీనివల్ల గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలు గాలివీస్తున్నప్పుడల్లా చెల్లాచెదురై దుర్గంధాన్ని వెదజల్లుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పట్టణానికి చెందిన 1,2,3,4 వార్డుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది ఆకతాయిలు చెత్తగుట్టలకు అగ్గిపెట్టడంతో వెలిగించడంతో పెద్దపెద్ద మంటలు చెలరేగి అనంతరం పట్టణంలోకి పొగ పలు వీధులకు ప్రవేశించి వృద్ధులు, చిన్నారులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా మార్చుతుంది. పట్టణంలో ఈ సమస్యను నివారించేందుకు ప్రత్యామ్నాయంగా పట్టణ పొలిమేరల్లో ఐదు ఎకరాల స్థలాన్ని సేకరించి అందులో వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు రూ.55 లక్షలు ప్రభుత్వం కేటాయించినప్పటికీ, అధికారుల్లో చొరవ, పాలకుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో స్థల సేకరణ జరగలేదు. కొంతమంది కమిషనర్లు స్థల సేకరణ జరిపినప్పటికీ స్థానిక రాజకీయ నాయకులు ప్రవేశించి తమ గ్రామాల్లో వ్యర్థ పదార్థాలను రవాణా చేయకుండా అడ్డుకోవడంతో ప్రతిపాదనలు మూలకు చేరుతున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయాన్ని తీసుకుని అటు పట్టణ ప్రజలకు, ఇటు శివారు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సాలూరు బొబ్బిలి మున్సిపాలిటీల మాదిరిగా వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తశుద్ధి కేంద్రాల నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తున్న జట్టు ఆశ్రమం

పార్వతీపురం పట్టణంలో రాయగడ రోడ్డు డంపింగ్ యార్డ్‌కు కూతవేటు దూరంలో ఉన్న జట్టు ఆశ్రమ నిర్వాహకులు పద్మజ ఆధ్వర్యంలో పునర్వ అనే సంస్థ ద్వారా పట్టణంలోని చెత్తను సేకరించి, తద్వారా ఎరువులు కాగితాలు వంటివి తయారుచేసి సంపదను సష్టిస్తున్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని పార్వతీపురం మున్సిపాలిటీ కూడా అదే పద్ధతిలో చెత్తను విడదీసి సంపదగా మార్చగలిగితే మున్సిపాలిటీకి ఆదాయంతో పాటు పట్టణానికి వ్యర్థ పదార్థాల సమస్యను నివారించవచ్చని చాలామంది అభిప్రాయపడుతున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కోసం సాక్ష్యం యాప్

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి విజ్ఞప్తి

ప్రజాశక్తి-విజయనగరం కోట

వచ్చే సాధారణ ఎన్నికల్లో జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకునే వయో వృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద తగిన వసతులు కల్పించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందనిజిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఈ వసతులను వినియోగించుకునే నిమిత్తం ఎన్నికల సంఘం రూపొందించిన సాక్ష్యం యాప్‌లో వారు తమ పేరు నమోదు చేసుకోవలసి వుంటుందని పేర్కొన్నారు. సాక్ష్యం యాప్ లో నమోదు చేసుకున్న వికలాంగులు, వయో వృద్ధులను వీల్ చైర్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తీసుకువచ్చే విధంగా రవాణా సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, షెల్టర్, పార్కింగ్, వాలంటీర్ సేవలను అందిస్తామని తెలిపారు. ఆయా ప్రాంత బిఎల్‌ఒల ద్వారా ఈ సేవలు అందిస్తారని తెలిపారు. ఈ యాప్ వినియోగంపై రాష్ట్ర ఎన్నికల సంఘం అదనపు సిఇఒ నిర్వహించిన ఆన్ లైన్ సమావేశంలో ఈమేరకు సూచించారని వికలాంగుల సంక్షేమశాఖ ఎడి జివిబి జగదీష్ తెలిపారు.

సుపరిపాలనకు మద్దతివ్వండి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశకి-విజయనగరం టౌన్

రాజకీయాలకతీతంగా పేదరికమే కొలమానంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేనని డిప్యూటీ స్పీకర్, నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఐదేళ్లపాటు సుపరిపాలన అందించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు ఓట్ల రూపంలో ఆశీస్సులు అందించాలని అభ్యర్థించారు. మంగళవారం నగరంలోని 21 వ డివిజన్ నాగవంశం వీధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన తనకు మరోసారి అవకాశమిస్తే అసలు సమస్యలే లేకుండా చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లి, మేయర్ విజయలక్ష్మి, 20వ డివిజన్ కార్పొరేటర్ కంటుభుక్త తవిటి రాజు, బేరు సత్యనారాయణ, కాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాగవంశం వీధిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

ఎన్నికల కమిషనా..? ఎన్‌డిఎ కమిషనా?

డిప్యూటీ సిఎం రాజన్న దొర

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ పనితీరు చూస్తుంటే ఎన్‌డిఎ కమిషన్‌లా వ్యవహరిస్తుందని డిప్యూటీ సిఎం, సాలూరు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్న దొర అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని నంద, కత్తులు గ్రామాలలో విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగానే అభివృద్ధి సంక్షేమ పథకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయమని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు నిమ్మగడ్డ రమేష్‌తో కుమ్మక్కై ప్రజలకు పథకాలు అందకుండా నిలుపు చేశారని ఆరోపించారు. తెలంగాణలో సంక్షేమ పథకాలను అమలు చేసుకోవాలని ఆదేశించిన ఎన్నికల కమిషన్ ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే మోకాలు అడ్డుతోందని విమర్శించారు. ఎన్నికల సమయం సమీపిస్తున్నప్పటికీ అధికారులను మార్పి చేస్తూ అప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నారని, దీన్ని బట్టి చూస్తే రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరిగే పరిస్థితి లేదన్న అనుమానం వ్యక్తం అవుతుందని ఆయన తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో మళ్లీ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అలాగే చంద్రబాబు నాయుడు పూర్తిగా దిగజారు స్థాయిలో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సభల్లో ఉపయోగించలేని పదాలను మహిళలపై ఉచ్చరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయ సభల్లో ఇలాంటి మాటలు ఉపయోగించడం బాధాకరమని ఆయన అన్నారు.

ఏకపక్షంగా ఇసి వ్యవహార శైలి

గజపతినగరం : ఇసి వ్యవహార శైలి ఏకపక్షంగా ఉందని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఇసి వ్యవహరిస్తోందని, రాష్ట్రానికో రూలు పెడుతుందని విమర్శలు చేశారు. పక్క రాష్ట్రమైన తెలంగాణలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నప్పుడు, గతంలో టిడిపి పసుపు- కుంకుమ ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు మన రాష్ట్రంలో ఎందుకని ప్రశ్నించారు. దీని వెనక ఎవరి ఒత్తిడి ఉంది, ఎవరు ఆడిస్తున్నారనేది ప్రజలకు అర్థమవుతుందని అన్నారు. ఈ విధానంతో రైతులు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతారని, దీనిపై పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, వైస్ సర్పంచ్ కర్రి రాముానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
బుధవారం 8 మే 2024

రిసెప్షన్ సెంటర్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

పటిష్టంగా స్ట్రాంగ్ రూమ్‌లను రూపొందించాలి

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రిసెప్షన్ సెంటర్లవద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, జిల్లా ఎస్‌పి దీపికతో కలిసి డెంకాడ మండలంలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూములు, బారికేడింగ్, పార్కింగ్, భోజన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. లెండి కళాశాలలో రాజాం, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల, శంగవరపుకోట నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ అనంతరం ఇవిఎంలను తీసుకువచ్చే అధికారులు, సిబ్బంది, రిసెప్షన్ సెంటర్ సిబ్బంది రాకపోకలకు ఎక్కడా ఇబ్బంది పడకుండా కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇవిఎంలను తీసుకొని రావడానికి, స్ట్రాంగు రూములోకి తరలించడానికి, అవసరమైన పత్రాలను నింపేందుకు, అందజేసేందుకు వీలుగా కౌంటర్లు ఉండాలన్నారు. బస్సులు, అధికారుల వాహనాలు లోపలికి రావడానికి, సిబ్బందిని దించి బయటకు వెళ్లడానికి వీలుగా వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయాలని, ఎక్కడా ట్రాఫిక్ జామ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పటిష్టమైన భద్రత నడుమ ఇవిఎం స్ట్రాంగ్ రూములను సిద్ధం చేయాలని, పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, రిసెప్షన్ సెంటర్ నోడల్ అధికారులు మెప్మా పిడీ ఎం.సుధాకరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ భాస్కర్రావు, డిఎస్‌ఒ మధుసూదనరావు, ట్రాన్స్‌కో ఎస్‌ఇ లక్ష్మణరావు, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ విజయరత్నం, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు వల

(మొదటిపేజీ తరువాయి)

కొందరు అంగన్‌వాడీలకు, కాంట్రాక్టు ఉద్యోగులకు నగదు ఎర చూపగా, వారు తిరస్కరించినట్టు తెలిసింది. బలిజిపేట మండలంలో స్థానిక నాయకుల ఒత్తిళ్ల మేరకు నగదు తీసుకున్నట్లు సమాచారం. ఉద్యోగ భద్రత, సరైన ఆదాయం కూడా కలిగిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొందరు నగదు ప్రభావానికి లోనైట్లు సమాచారం. పార్వతీపురం మున్సిపాలిటీలో కొందరికి ఫోన్లలో నగదు బదిలీ జరిగినట్లు తెలుస్తుంది. తక్షణ అవసరాల నిమిత్తం, స్థానిక పరిస్థితుల ప్రభావంతో కొంతమంది నగదు ప్రభావానికి లోనైనప్పటికీ, ఓటింగ్ మాత్రం తమ ఇష్టప్రకారమే వేసినట్లు చెపుతున్నారు. అభ్యర్థుల గెలుపు, ఓటములపై అంతగా ప్రభావం చూపని పోస్టల్ బ్యాలెట్ విషయంలోనే ఇంతగా కాసులు కురిపిస్తే, వారంరోజుల్లో జరిగే సాధారణ ఎన్నికల్లో ధనం ఎంతగా ప్రవహించనున్నదోనన్న చర్చ జరుగుతోంది.

విజయనగరంలోని జెఎన్‌టియు కేంద్రంలో జరిగిన ఓటింగ్ మొదటి రోజు నుంచి అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉద్యోగులు ఓట్లు వేస్తున్నారంటూ ప్రచారం సాగింది. ఈనేపథ్యంలో వైసిపి నాయకులు ఉద్యోగుల ఫోన్ నెంబర్ తీసుకొని ఫోన్ పే ద్వారా డబ్బులు వేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా మొత్తంగా 18,631 పోస్టల్ బాలెట్లు ఓట్లు ఉండగా, ఒక్క విజయనగరం నియోజకవర్గంలోనే 3975 మంది ఓటర్లు ఉన్నారు. వైసిపి, టిడిపి మధ్య హోరా హోరీ పోటీజరుగుతున్న విజయనగరంలో పోస్టల్ బ్యాలెట్‌ఓట్లు కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ఉద్యోగులకు డబ్బులు ఎర వేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే సుమారుగా 70 శాతం ఓటింగ్ జరిగింది. ఇంకా రెండు రోజులు ఓటింగ్ కు అవకాశం ఉంది. అంగన్‌వాడీ వర్కర్లను కూడా ఒపిఒలుగా నియమించడంతో వారికి కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు అవకాశం వచ్చింది. వారి ఇళ్లకు వెళ్లి ఓటు వేయించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉద్యోగులు డబ్బులు తీసుకోకపోతే వారికి బాగా పరిచయం ఉన్న వ్యక్తుల ద్వారా డిన్నర్ వంటి పార్టీలకు పిల్చి ప్రసన్నం చేసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రం వద్దకు ఓటు వేసేందుకు వస్తున్న ఉద్యోగులను మధ్య తోవలో వారి ఫోన్ నెంబర్ అడగడం, వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ ఇవ్వడం, ఓటు వేయండి మీ ఫోన్‌పే కు డబ్బులు పడతాయని చెప్పడం వంటి దృశ్యాలు జెఎన్‌టియు సమీపంలో కనిపించాయి.

యువతకు భరోసా ఇస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టారని విమర్శించారు. కుటుంబసభ్యులే ఆయనను నమ్మడం లేదని, వైసిపి నాయకులకు వారి కుటుంబసభ్యులు నమ్మడం లేదని అన్నారు. హత్యారాజకీయాలు చేసిన అన్నను నమ్మవద్దని చెల్లి సునీత చెప్పిందని, జగన్ కు ఓటువేస్తే మా కుటుంబానికి పట్టిన గతే రాష్ట్రానికి అని చిన్నమ్మ సౌభాగ్యమ్మ చెప్పిందని అన్నారు. జగనన్న ఊసరవెల్లి అని చెల్లెమ్మ షర్మిల చెప్పిందన్నారు. కుటుంబసభ్యులే నమ్మని జగన్ ను ప్రజలు ఎలా నమ్మాలి? అంబటి రాంబాబు నీచుడు, దుర్మార్గుడు అని ఆయన అల్లుడు చెప్పారని, సొంత కొడుకుకే న్యాయం చేయలేదని ముత్యాలనాయుడు కుమారుడు చెప్పాడని వివరించారు. ముద్రగడ కూతురు మీడియా ముందు వైఎస్ జగన్ మా తండ్రిని ట్రాప్‌లో పడేశారని, వాడుకుని వదిలేస్తాడని చెప్పిందని, దువ్వాడ శ్రీను భార్య తన భర్తకు ఓటువేయద్దని చెప్పిందని అన్నారు.ఇలా జగన్, వైసిపి నాయకులను వారి కుటుంబసభ్యులు నమ్మడం లేదని, . 5కోట్ల మంది ప్రజలు ఎలానమ్మాలి? అని ప్రశ్నించారు.

2019లో ఒక్క అవకాశం మాయమాటలో పడి ప్రజలు మోసపోయారని లోకేష్ అన్నారు. అధికారంలోకి వచ్చాక 2.3లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అన్నాడని, ఒక్క ఉద్యోగం ఇచ్చాడా? అనిప్రశ్నించారు. ఫీజు రియంబర్స్ మెంట్ లేదు, నిరుపేద విద్యార్థులకు విదేశీవిద్య కూడా లేదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం మెగా డిఎస్‌సి పైనే అని తెలిపారు. సింగిల్ జాబ్ క్యాలెండర్ ప్రతిఏటా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేస్తామని, అయిదేళ్లలో పెండింగ్ పోస్టులన్నీ భర్తీ చేస్తామని, ప్రైవేటురంగంలో పెట్టుబడులు, పరిశ్రమలు రప్పించి 20లక్షల ఉద్యోగాలు తెస్తామని యువతకు భరోసా ఇచ్చారు.

ఆ సొమ్మంతా ఏ పంది కొక్కులు తింటున్నాయో చెప్పండి

బొత్స కుటుంబం జిల్లాను కేకు ముక్కలా కోసుకుని తింటున్నారని లోకేష్ విమర్శించారు. బొత్స సత్యనారాయణ, అప్పలనర్సయ్య, చిన్నశ్రీను, బడ్డుకొండ అప్పలనాయుడు ఇలా ఏరియాలవారీగా పంచుకున్నారని అన్నారు. ఇసుక, మద్యం, మైన్స్ డబ్బులు ఏ పందికొక్కులు తింటున్నాయో చెప్పాలని అన్నారు. ప్రజల భూములకు కొట్టేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారన్నారు. మళ్లీ రాష్ట్రాన్ని జాబ్ క్యాపిటల్ గా మార్చాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అధికారంలోకి వస్తే విజయనగరం జిల్లాకు పరిశ్రమలు తెస్తామని, యువతకు ఉపాధి కల్పించి వలసలను నివారిస్తామని హామీ ఇచ్చారు. జగన్ టైమ్ అయిపోయిందని, ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

(మొదటి పేజీ తరువాయి)

హామీ చట్టం, అటవీ హక్కులు చట్టం వచ్చాయని వివరించారు. కురుపాం నియోజకవర్గంలో గల గుమ్మిడిగెడ్డ, పూర్ణపాడు లాబేసు వంతెన సమస్య, జీడి ప్రాసెసింగ్ యూనిట్ కోసం, ఏనుగుల తరలింపు, పోడు భూముల సమస్య, తోటపల్లి నిర్వాసితుల సమస్యలపై సిపిఎం పోరాడుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించి చట్ట సభలకు పంపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. సిపిఎం తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులైన మండంగి రమణ, పి.అప్పలనరసకు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, నాయకులు ఎ.జగన్మోహనరావు, కొల్లి సాంబమూర్తి, రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి రమణమూర్తి, రామారావు, శివున్నాయుడు పాల్గొన్నారు.



గడసింగిపురంలో మాట్లాడుతున్న సిపిఎం అభ్యర్థి మండంగి రమణ

అబద్దాల కూటమిని చిత్తుగా ఓడించాలి

సిపిఎం అభ్యర్థి మండంగి రమణ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

అబద్దాల కూటమి పార్టీలైన బిజెపి, టిడిపి, జనసేనను, తొత్తుపార్టీ అయిన వైసిపిని చిత్తు గా ఓడించాలని సిపిఎం కురుపాం నియోజకవర్గ అభ్యర్థి అభ్యర్థి మండంగి రమణ పిలుపునిచ్చారు. మండలంలోని గడసింగపురం, బొమ్మిక, దంగభద్ర, గెడ్డ తిరువాడ, అంకవరం, చిన బుడ్డిడి, పెదబుడ్డిడి, జోగులడుమ్మ,లో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రజా వ్యతిరేక పార్టీ అని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలపై జీఎస్టీ పేరుతో కోట్లాది రూపాయలను దోచుకుని కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ ఆస్తులను కట్టబెడుతుందని ఇలాంటి పార్టీకు తొత్తులుగా టిడిపి, జనసేన కలిసి పొత్తులతో కొత్త నాటకానికి తెర తీసి రాష్ట్ర ప్రజలను మరింత అధోగతి పాలు చేసిందని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు ఇది గమనించి తమ ఓటుతో ఈ పార్టీలకు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. కురుపాం నియోజకవర్గంలో గల గుమ్మిడిగెడ్డ, పూర్ణపాడు లాబేసు వంతెన సమస్య, జీడి ప్రాసెసింగ్ యూనిట్ కోసం, ఏనుగుల తరలింపు, పోడు భూముల సమస్య, తోటపల్లి నిర్వాసితుల సమస్యలపై సిపిఎం పోరాడుతోందని తెలిపారు. సిపిఎం ప్రజా ఉద్యమాలతో అనేక సమస్యలను పరిష్కరించడంలో కీలకపాత్ర వహించిందని, కావున జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా అప్పలనరసను సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కొల్లి గంగనాయుడు,కూరంగి సీతారాం, మండంగి శ్రీను, భూతాలు మోహన్ రావు తదితర లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
బుధవారం
8 మే 2024



టిడిపి శ్రేణుల నోటా



ప్రజాశక్తి - మక్కువ

నిన్న మొన్నటి వరకు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి ఎవరైనా గెలిపించుకునేందుకు అంతా సిద్ధంగా ఉన్నామని తీర్మానించుకున్న తెలుగుదేశం నేతల్లో ఇప్పుడు ఏ నోట విన్నా తమ ఓటును రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నోటాకు వేయడమే మంచిది అన్న ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కొంతకాలం భిన్నధృవాలుగా ఉన్న పెంట తిరుపతిరావు గ్రూపు, గుమ్మడి సంధ్యారాణి గ్రూపు అధిష్టానం నేతల దౌత్యంతో ఒకటయ్యారన్న ఆనందం పార్టీ శ్రేణుల్లో కొంతమేరకు నెలకొన్నప్పటికీ అది ఇటీవల మండలంలోని సంధ్యారాణి ఎ.వెంకంపేట, కోన పంచాయతీల ఎన్నికల ప్రచారంలో తిరుపతిరావును పిలిచినట్లే పిలిచే అవమానపర్చేలా ఉండడంతో ఆ గ్రూపు నేతల్లో నైరాశ్యం నెలకొంది. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్నప్పుడే ఇలా వ్యవహరిస్తే రేపు గెలిచాక ఇంకే విధంగా ఉంటుందోనని వారంతా లోలోనా మదనపడుతూ వస్తున్నారు. మరోవైపు ప్రత్యర్థి పార్టీ వైపు చూడలేక తాము నమ్ముకున్న పార్టీకి అభిమానం ఉన్నప్పటికీ ఓటు వేయలేని సందిగ్ధంలో మండలంలోని టిడిపిలోని ఒక వర్గం అంతా కొట్టుమిట్టాడుతున్నారు. తమ నాయకుడిని అవమానించేలా ప్రవర్తిస్తున్న అభ్యర్థి తీరును గ్రహిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమెకు ఓటు వేయకుండా నివారించాలంటే నోటా గుర్తుకే ఓటు వేయాల్సిన పరిస్థితి దాపురించిందని టిడిపి శ్రేణులు తలలు పట్టుకుంటున్నాయి. మండలంలోని సంధ్యారాణి అనుకూల వర్గం తమను కనీసం పార్టీకి చెందిన వారిగా చూడకపోవడం వల్లే వీరంతా ఇలాంటి నిర్ణయం తీసుకునేందుకు వెనుకాడడం లేదన్నది మండలంలో హాట్ టాపిక్ గా చక్కర్లు కొడుతుంది. ఒకవేళ ఇదే ఒరవడి కొనసాగినట్లయితే మండలంలోని టిడిపి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే మండలంలోని ప్రతి గ్రామంలో పాలకపక్ష పార్టీ వైసిపి ప్రచారంలో ఓవైపు దూసుకుపోతూ ఉంటే చివర అంకానికి చేరుకున్నప్పటికీ మండల టిడిపిలో ఈ దుర్భర పరిస్థితిని చూసి పార్టీ అభిమానులు, కార్యకర్తలు అత్యంత భావోద్వేగానికి గురవుతున్నారు. ఈ పరిస్థితి కేవలం తమ మండలంలోనే కాదని, నియోజకవర్గమంతా నెలకొందన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో టిడిపి నిలదొక్కుకోవడం ఒకింత ఇబ్బందికరమేనని పలువురు పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా జనసేన, బిజెపి పార్టీ నేతలతో కూడా ఇలాంటి వైఖరి టిడిపి నియోజకవర్గ నాయకులు అనుసరిస్తున్నారని ఆయా పార్టీ నేతలు కూడా లోలోన పడుతున్నట్లు బయట ప్రచారం జరుగుతుంది.

రైతుల భూములకు రక్షణ కరువు

మాజీమంత్రి సుజయకృష్ణ

ప్రజాశక్తి-బొబ్బిలి

ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో రైతుల భూములకు రక్షణ ఉండదని మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు ఆందోళన వ్యక్తంచేశారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయనకు మద్దతుగా మంగళవారం దాడితల్లి కాలనీలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచక పాలన సాగుతోందని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేస్తుందని చెప్పారు. ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం చెప్పాలని కోరారు. ప్రచారంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓట్లను అభ్యర్థిస్తున్న మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు

క్రాస్ ఓటింగ్ గుబులు

- వైసిపి, టిడిపిలో ఆందోళన
- 2004 ఎన్నికలను గుర్తుచేసుకొంటున్న అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి, టిడిపి అభ్యర్థులను క్రాస్ ఓటింగ్ కలవరపెడుతోంది. పార్లమెంట్, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు సాగుతోన్న వేళ అభ్యర్థుల్లో ఆందోళన కనిపిస్తోంది. వైసిపి, టిడిపిల అభ్యర్థులు తమకు ఒక్క ఓటు తనకు వేయాలంటూ ఓటర్లను కోరుతున్నారు. అడిగారు కాబట్టి ఒకటి ఆపార్టీకి, ఇంకోటి ఈ పార్టీకి వేసే ఎలా ఉంటుందంటూ ఓటర్లలో చర్చ జరుగుతోంది. దీంతో క్రాస్ఓటింగ్ జరుగుతుందేమోనన్న ఆందోళన అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. విజయనగరం అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టిడిపి నుంచి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, వైసిపి అభ్యర్థిగా కోలగట్ల వీరభద్రస్వామి, కాంగ్రెస్ అభ్యర్థిగా సుంకరి సతీష్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మీసాల గీత, మరికొంతమంది ఇండిపెండెంట్, వివిధ పార్టీలు నుంచి మొత్తం 15 మంది పోటీలో అన్నారు. నిన్నటి వరకు ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు నేతలు తమదే గెలుపు అన్నట్లు వ్యవహరించారు. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పోటీ చేస్తుండడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఇది ఏ పార్టీని దెబ్బతీస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

2004లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామి కేవలం 1126 ఓట్ల మెజార్టీతో మాత్రమే అశోక్‌గజపతిరాజుపై గెలుపొందారు. ఇక్కడ టిడిపి ఓడిపోగా, పార్లమెంట్ స్థానంలో మాత్రం టిడిపి అభ్యర్థి కొండపల్లి పైడితల్లినాయుడు కాంగ్రెస్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిపై 31,348 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాంటి పరిణామాలు పునరావృతమైతే పరిస్థితి ఏమిటని వైసిపి, టిడిపి అభ్యర్థులు ఇద్దరిలోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం పోటీలో ఉన్న కోలగట్ల, అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఇద్దరూ ఆర్థికంగా బలంగా ఉన్నవారే. మీసాల గీత కూడా ఆర్థికంగా బలమైన వ్యక్తి కావడంతో ప్రధాన పార్టీలు నాయకులకు తలనొప్పిగా మారింది. గెలిచి తీరాలనే దోరణితో ఖర్చు పెడుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి సాంప్రదాయ ఓటింగ్, వామపక్షాల ఓట్లు బలంతో ప్రజల్లో వస్తున్న మార్పు కారణంగా ఓట్లు అధికంగా పడే అవకాశం కనిపిస్తోంది. అయితే ఈ ఓట్లు వైసిపి, టిడిపిపై ఎంతటి ప్రభావం చూపుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో సామాజిక సమీకరణలు బేరీజు వేసుకుని ముందుకు సాగుతున్నారు. బహిరంగ సభల్లో పార్టీలను గెలిపించాలని చెబుతున్నా, వ్యక్తిగతంగా కలిసి మాట్లాడుతున్న సమయంలో ఎంఎల్ఎ ఓటు నాకు వేసి, ఎంపి ఓటు మీ ఇష్టం అన్నట్లు ప్రచారం చేస్తున్నట్లు సమాచారం. అటు ఒకటి, ఇటు ఒకటి ఓటు వేస్తే క్రాస్ ఓటింగ్ ఎవరి కొంప ముందచుతుందోననే భయం అభ్యర్థులను వెంటాడుతోంది.



హోరాహోరీ స్థానాల్లో

బెట్టింగ్ జోరు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఇంకా జరగనే లేదు.. అప్పుడే గెలుపు ఓటములపై జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అన్నట్లు పోటీ నెలకొంది. ఫలితాలపై జనానికి ఉన్న ఆసక్తికి.. తమ పార్టీల గెలుపుపై అభిమానులకు... నాయకులకు ఉన్న విశ్వాసానికి ఈ పందేలు నిదర్శనంగా మారాయి. కొంతమంది భూములకు మరి కొంతమంది లక్షల్లో పందేలు కడుతున్నారు. ఆ స్థాయిలో కాకపోయినా దాదాపు ప్రతి పల్లెలోనూ ఈ తరహా పందేలు సాగుతున్నాయి. 'మా పార్టీ అధికారంలోకి వస్తుంద'ని ఒకరంటే... 'కాదు మా పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందని' మరొకరు అంటున్నారు. ఇలా పరస్పరం పందేలు కాసుకుంటున్నారు. ప్రధానంగా విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో వైసిపి, టిడిపి, జనసేన అభ్యర్థుల గెలుపు ఓటములపై ఎక్కువగా పందేలు జరుగుతున్నాయి. వివిధ పార్టీల అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో వస్తున్న స్పందనను బట్టి ఓ అంచనాకు వస్తున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రంలో పోటీ నువ్వా నేనా అన్నా చందంగా ఉండటంతో టిడిపి వైసిపిలపై పందెంరాయుళ్లు 'పెట్టుబడి' పెడుతున్నారు. ఇక పట్టణాల్లోనూ ఈ తరహా పందాలు సాగుతున్నాయి. కాకపోతే అవి కాస్తా 'కార్పొరేట్ స్టైల్‌లో ఉంటున్నాయి. ప్రచారం ముగింపు దశకు చేరుతున్న వేళ పందేలు మరింత ఊపందుకున్నాయి. విజయనగరం ఎమ్‌పికి కూటమి తరపున కలిశెట్టి అప్పలనాయుడు. వైసిపి తరపున బెల్లాన చంద్రశేఖర్ పోటీలో ఉన్నారు. వీరిద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. దీంతో ఎవరు గెలుస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. వీరిద్దరిపై కూడా జోరుగాపందేలు సాగుతున్నాయి. విజయనగరం అసెంబ్లీ స్థానంలో కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు, వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి, గజపతినగరంలో వైసిపి అభ్యర్థి బొత్స అప్పలనర్సయ్య, టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్, నెల్లిమర్లలో వైసిపి అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, జనసేన అభ్యర్థి లోకం మాధవి గెలుపు ఓములపై బెట్టింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. పోలింగ్ జరిగి ఓట్ల లెక్కింపునకు వచ్చేసరికి బెట్టింగ్‌లు మరింత ఊపందుకోనున్నాయి.

ఏజెన్సీలో సిపిఎం ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి - సీతంపేట

ఇండియా వేదిక తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మంగళవారం ఏజెన్సీలో సిపిఎం ముమ్మరంగా ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని వాబ, జక్కరవలస, నౌగూడ, మండ కాలనీ తదితరు గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనరస, పాలకొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సవర చంటిబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గిరిజనులకు అండగా ఇండియా కూటమి ఉంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సిపిఎం ముందంజలో ఉంటుందన్నారు. ఈ ప్రచారంలో సిపిఎం మండల కార్యదర్శి హారిక భాస్కరరావు, నాయకులు ప్రకాష్‌రావు, జయ కుమార్, శ్రీరాములు, గంగాధర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని పులిపుట్టి, మర్రిపాడు పంచాయతీల్లో ముకుందపురం, రేగులు గఃడా, ఈతమాను గూడ కాలనీ, సుందరయ్యగూడ, కళ్ళంగూడ, మర్రిగూడ పంచాయతీల్లో మూలగూడ, గుడి గుడ్డి ,రేకులు గూడా తదితర గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇండియా వేదిక సిపిఎం బలపర్చిన అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పల నర్సను, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవర బాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగరాపు సింహచలం, నాయకులు మండంగి వెంకటేష్, మండంగి కాంతారావు, సాయికుమార్ పాల్గొన్నారు.



దోనుబాయిలో ప్రచారంలో చేస్తున్న సిపిఎం సర్పంచ్ సుందరమ్మ, నాయకులు

రోజుకు వెయ్యి మందిని కలవాలి

వైసిపి శ్రేణులకు ఎమ్మెల్యే కడుబండి దిశానిర్దేశం



కొత్తవలస.. కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రోజుకు వెయ్యి మంది ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి, వైసిపి హయాంలో చేసిన మేలును వివరించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు.. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చేయాలన్నా, పదవులు కావాలన్నా ప్రతిఒక్కరూ శ్రమించాలన్నారు. జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసే బాధ్యత మీదేనని, జగన్ సైన్యం మీరేనని అన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే విశాఖ పాలన రాజధానిగా అవుతుందని, అప్పుడే ఈ నియోజకవర్గానికి అభివృద్ధి ఫలాలు అందుతాయని చెప్పారు. అందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రతి గడపకూ వెళ్లి మనం చేసిన మేలును ప్రతిఒక్కరికీ వివరించాలని కోరారు. ఈ ఐదు రోజుల మీ కష్టం ఐదేళ్లపాటు సంతోషాన్ని ఇస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జిసిసి చైర్‌పర్సన్ స్వాతిరాణి, జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకట రమణ, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, పట్టణ అధ్యక్షులు రెహమాన్, మహిళా అధ్యక్షురాలు యామిని దేవి,, డాక్టర్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

కొత్తవలస : పారిశ్రామిక అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని, కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. జిందాల్ కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులకు ఏమి అవసరమో వాటిని తూచా తప్పకుండా యాజమాన్యంతో మాట్లాడి అందించేలా కృషి చేస్తానన్నారు. కార్మిక హక్కులకు భంగం వాటిల్లకుండా చూస్తామని భరోసానిచ్చారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, వైసిపి ఎల్.కోట మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, సీనియర్ నాయకులు కూరాకుల సూర్యారావు, రామలింగాపురం ఎంపిటిసి లెంక వరహాలు, అప్పన్నపాలెం సర్పంచ్ కోనదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటి ప్రచారం

వేపాడ : ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు మద్దతుగా వావిలపాడులో సర్పంచ్ బీల రాజేశ్వరి ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం చేశారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామునాయుడు, వైసిపి నాయకులు కన్వీనర్ బి.సతీష్, ఉపసర్పంచ్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. వావిలపాడులో ప్రచారం చేస్తున్న సర్పంచ్ బీల రాజేశ్వరి

హామీల అమలు ఘనత మాదే


ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత వైసిపికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. పట్టణంలోని 4,8 వార్డులలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసిపి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసిన వైసిపిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే శంబంగి, ఆయన కుమారుడు శంబంగి శ్రీకాంత్ రెండు బృందాలుగా ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

తెర్లాం : మండలంలోని అరసబలగ గ్రామానికి చెందిన 15 కుటుంబాలు యాగటి రాము ఆధ్వర్యాన వైసిపిలో చేరాయి. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సమక్షంలో వారంతా వైసిపిలో చేరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి చెపేన సత్యనారాయణ, నాయకులు మాదాసు శేషగిరి, ఆవాల తిరుపతిరావుద ఆవాల రామారావు వై.రమణ, పి.సాయిమోహన్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

అక్కకు తోడుగా చెల్లెలు ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి అభ్యర్థి పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు తోడుగా ఆమెసోదరి విద్యావతి దేవి మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. కొత్తపేట యాదవ వీధిలో విజయలక్ష్మి గజపతిరాజును గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి అభ్యర్థించారు. ఆమె ప్రచారంతో కార్యకర్తల్లో నోతనూత్తేజం కనిపించింది. ఈ సందర్భంగా ఆమెకు పలువురు మహిళలు హారతులు పట్టారు.

టిడిపిలో భారీ చేరికలు

నగరంలోని 7,12,16 డివిజన్లకు చెందిన పలువురు వైసిపి నాయకులు మంగళవారం టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి సమక్షాన ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అధోగతి పాలైపోతున్న పరిస్థితిని చూసి ప్రజలు ఈరోజు టిడిపిలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ నాయకులు, 7, 12, 16 డివిజన్లకు చెందిన దేవి, శ్రీను పైడిరాజు లక్ష్మి సురేంద్ర సూరిబాబు రాజేష్ శంకర్ మాతాబుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అభ్యర్థి అదితికి మద్దతుగా ప్రచారం చేస్తున్న సోదరి విద్యావతిదేవి

పథకాలు కొనసాగాలంటే వైసిపిని గెలిపించాలి

నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి-నెల్లిమర్ల, డెంకాడ

సంక్షేమ పథకాలు యధాతథంగా కొనసాగాలంటే వైసిపిని గెలిపించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. మంగళవారం నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని ఏడో వార్డులో , డెంకాడ మండలం పినతాడివాడలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ శత శాతం అమలు చేశారని, వాటిని గుర్తు పెట్టుకొని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, ఎమ్మెల్యే కుమారుడు మణిదీప్ నాయుడు, ఎఎంసి చైర్మన్ చిక్కాల అరుణ కుమారి, డెంకాడ ఎంపిపి బి.వాసుదేవరావు, వైస్ ఎంపిపిలు పిన్నింటి తమ్మునాయుడు, పతివాడ సత్యనారాయణ, పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ వి.వెంకటరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, నాయకులు గంటా సతీష్, రేగాన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, చిక్కాల సుమతి, నాయకులు జనాప్రసాద్, బైరెడ్డి నాగేశ్వరరావు, లీలావతి, పాండ్రాంకి మహాలక్ష్మి, పతివాడ అప్పారావు తదితరుల పాల్గొన్నారు.



నెల్లిమర్ల.. ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ఏకలవ్య కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ గురుకులం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భామిని, మెళియాపుట్టి మండలాల్లో ఉన్న ఏకలవ్య కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పిఒ శుభం బన్సర్ మంగళవారం ప్రయాణంలో తెలిపారు. www.aptwgurukulam.ap.gov.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 7న భామిని ఏకలవ్య కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ పరిశీలన

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేస్తున్న ఎన్నికల మెటీరియల్‌ను తనిఖీ చేశారు. ఇంటి ఓటింగ్ పోస్టల్ బ్యాలెట్ల బాక్స్‌లకు సీల్ ప్రక్రియ పూర్తి చేశారు. అనంతరం ఉల్లిభద్రలోని హార్టికల్చర్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించారు. ఇదిలా ఉండగా మూడోరోజు పోస్టల్ బ్యాలెట్‌కు 209 ఓట్లు నమోదయ్యాయి. మొత్తం 1444 ఓట్లుకు గానూ ఈ మూడురోజులు1314 ఓట్లు పోలయ్యాయి. కురుపాంలో 2502 ఓట్లుకు గానూ 2286 ఓట్లు పోలయ్యాయి. మంగళవారం 488 ఓట్లు నమోదయ్యాయి.



జమ్ముపేటలో ప్రచారం చేస్తున్న కళావెంకటరావు

గ్రామాల్లో టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో గరిడ, సదానందపురం, జమ్ముపేట, నగళ్లవలస గ్రామాల్లో మంగళవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టోను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో ప్రజలకు న్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మరిపి విద్యాసాగర్ అన్నారు. మున్సిపాలిటీలోని మల్లమ్మపేటలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల ధరలు, ఛార్జీలు పెంచి ప్రజలపై భారం వేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపిస్తే అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పని చేయడంతో పాటు ప్రజలపై భారాలు తగ్గిస్తామని చెప్పారు. ప్రచారంలో పిసిసి అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు, నాలుగు మండలాల అధ్యక్షులు రాంబాబు, రామకష్ణ, ఆర్. అప్పలనాయుడు, పొందూరు రవీంద్ర, పత్రి రాజు, నాయకులు రామారావు, జగదీష్, సాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



మల్లంపేటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి విద్యాసాగర్

ఎల్‌టిఎతో రైతులకు అన్యాయం

రద్దు చేయాలని తహశీల్దార్‌కు టిడిపి నాయకుల వినతి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయాలని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లాండ్ టైట్లింగ్ యాక్ట్ అమలు చేయలేదని, మరి అలాంటి చట్టం చేయడానికి జగన్ రెడ్డి ఎందుకు తొందర పడ్డారని ప్రశ్నించారు. ప్రజల భూములు కబ్జా చేసేందేకే జగన్ రెడ్డి ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ చట్టం తెచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు అకిరి ప్రసాదరావు, మాజీ లీగల్ సెల్ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి పిన్నింటి సన్యాసినాయుడు, టిఎన్‌టియుసి పార్లమెంట్ అధ్యక్షులు విక్రమ్ జగన్నాథం , చౌడవాడ ఎంపిటిసి పసుపులేటి గోపి, నాయకులు ఇజ్జీరోతు ఈశ్వరరావు, సర్పంచ్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. వినతి పత్రం సమర్పిస్తున్న టిడిపి అధ్యక్షుడు గొంప వెంకటరావు, నాయకులు

నెల్లిమర్ల : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో రైతులకు అన్యాయం జరుగుతుందని టిడిపి రాష్ట్ర నాయకులు సువ్వాడ రవి శేఖర్ అన్నారు. మంగళవారం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయాలని తహశీల్దారుకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూములపై కన్నేసి వాటిని కాజేసే పథకంలో భాగంగా సిఎం జగన్ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తీసుకొచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, తెలుగు యువత మండల అధ్యక్షులు నల్లం శ్రీనివాస్, నాయకులు గురాన అసిరినాయుడు పాల్గొన్నారు.

వేపాడ : ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన తహశీల్దార్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, ఐటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్, గుమ్మడి రాంబాబు, సేనాపతి అప్పారావు, కోకాడ భూషణం, తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే అభ్యున్నతి : రాజన్నదొర

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రంలో గత ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని, మళ్లీ రాష్ట్ర అభ్యున్నతి జరగాలంటే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నంద, మార్కొండపుట్టి తన సొంత పంచాయతీలో మంగళవారం ఎన్నికల ప్రచార కార్యక్రమం వైసిపి మండల నాయకులు ఎం.రంగునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెదగైశీలలో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపి అధికారంలోకి తీసుకురావాలని, అందులో భాగంగా వైసిపి అభ్యర్థిగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు, స్థానిక వైసిపి నాయకులు వి.శ్రీనివాసరావు, టి.శ్రీరాములు, బి.అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




నందలో ప్రచారం చేస్తున్న రాజన్నదొర

సాలూరు: మండలంలోని పెదపదం, పాలికవలసలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి ఇంటింటికీ తిరిగి జరిగిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాజన్నదొరను మరోసారి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి రాజన్నదొర ,ఎంపీ అభ్యర్థి తనూజా రాణి ని ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని పద్మావతి కోరారు.ఆమెతో పాటు వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సర్పంచ్ రెడ్డి సుకన్య వున్నారు.

వైసిపిది నియంత పాలన

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో వైసిపి నియంత పాలన సాగిస్తోందని అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సొరు సాంబయ్య తెలిపారు. మంగళవారం స్థానిక వేదాంత డవలపర్స్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాలకు బదిలీ చేశారని విమర్శించారు. దళితులకు ఇచ్చే 27 సంక్షేమ పథకాలను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. దళితులపై దాడులకు తెగబడుతున్నారని, కోవిడ్ సమయంలో మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్‌ను హింసించి చంపేశారని, దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేశారని ఆరోపించారు. మద్యం, ఇసుక, మైనింగ్ మాఫియాకు పాల్పడి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఓటుతో వైసిపికి గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో వేదాంత డెవలపర్స్ ఎమ్‌డి సురేష్, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఆర్గనైజర్ జి.సురేష్ ఉన్నారు.



హోంఓటింగ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

కొనసాగుతున్న హోం ఓటింగ్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా 85ఏళ్లు దాటిని వృద్ధులు, కదల్లేని స్థితిలో ఉన్న రోగులు, వికలాంగులు తమ ఓటు హక్కును ఇంటివద్దనే వినియోగించుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించినందున ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు పార్వతీపురం నియోజకవర్గంలో పలు మండలాల నుంచి సుమారు 270 ఫారం 12 ధరఖాస్తులు రాగా, ఈనెల 5నుంచి ఎన్నికల సిబ్బంది దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారికి బ్యాలెట్ పత్రాలు అందించి ఓటు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకంపేట, చినబొండపల్లిలో సహాయ ఎన్నికల అధికారి తహశీల్దార్ కె.ఆనందరావు అధ్వర్యంలో ఎన్నికల బృందం, సూక్ష్మపరిశీలకులు, 12మంది దరఖాస్తుదారుల ఇంటి వెళ్లి వారికి ఓటు బ్యాలెట్ పత్రాలు అందించి ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు.

కమిషనర్ పరిశీలన

పార్వతీపురం టౌన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో పది బృందాలతో హెూమ్ ఓటింగ్ ప్రక్రియ అనేది పకడ్బందీగా జరుగుతోంది. మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ నోడల్ ఆఫీసర్‌గా పాల్గొని ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన ఈ వెసులుబాటుకు 85 ఏళ్లు పైబడిన పిడబ్ల్యుడి ఓటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈదురుగాలులకు ఎగిరిన ఇంటి పైకప్పు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రెళ్ల పంచాయతీ గోరటి గిరి శిఖరలో మంగళవారం కురిసిన వర్షానికి గిరిజనులకు చెందిన రెండు రేకుల ఇళ్లతో పాటు పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం మంగళవారం ఉదయం ఏజెన్సీలో కురిసిన వర్షానికి తమ గ్రామంలో భారీ వర్షం కురిసింది. దీంతో రెండు రేకిళ్లతో పాటు వీధిలో ఉన్న ద్విచక్ర వాహనాలు కొద్దిపాటి ధ్వంసమయ్యారని తెలిపారు. ఈ మేరకు మండల రెవెన్యూ అధికారులు స్పందించి పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఇదిలా ఉండగా, సోమవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు విద్యుత్

పలు బైకులు ధ్వంసం

స్తంభాలు, వైర్లు, నేలకొరిగాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని రెల్ల, మండ, బీరుపాడు, దుడ్డు ఖల్లు, రస్తా కుంటుబాయి పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచింది. విద్యుత్ శాఖ సిబ్బంది పలుచోట్ల తెగిపడిన వైర్లు, ట్రాన్స్ఫార్మర్లు మరమ్మతులు చేపట్టి విద్యుత్తు పునరుద్ధరించినట్లు లైన్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.



గోరటిలో ఎగిరిపోయిన ఇంటి రేకులు

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సాధారణ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్ద అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో సూక్ష్మ పరిశీలకుల ఓరియంటేషన్ ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ రహస్యంగా, ప్రశాంతంగా జరగాలని అన్నారు. ఓటరు తప్పించి పోలింగ్ కేంద్రాల్లో ఎవరిని అనుమతించ రాదన్నారు. పోలింగ్ జరిగిన చోట ఎక్కడైనా హింసాత్మక ఘటనలు జరిగితే ప్రిసైడింగ్ అధికారికి, పోలీస్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. పోలింగ్‌లో ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనకు ఫోన్ ద్వారా సంప్రదించ వచ్చన్నారు. పోలింగ్ రోజున మాక్ పోలింగ్, పోలింగ్ ముగింపు అతి ముఖ్యమని చెప్పారు. రాజకీయ పార్టీలు 100 మీటర్ల దూరంలో ఎటువంటి ప్రచారం చేయడం నిషేధమన్నారు. ఓటరు మాత్రమే ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి రావాలని, ఇతరులు ఎవర్నీ లోపలకు అనుమతించరాదని స్పష్టం చేశారు. నియమించిన పోలింగ్ ఏజెంట్లు ఉదయం 5గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు మే 11న సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ప్రచారం చేసుకోవచ్చని వెల్లడించారు. పోలింగ్ రోజు ఉదయం గంట5.30లకు ఖచ్చితంగా మాక్ పోలింగ్‌ను జనరల్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహించాలన్నారు. ఉదయం 7 గంటల సమయానికి పోలింగ్ మొదలు కావాలని, మాక్ పోలింగ్ సర్టిఫికెట్ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరైనా నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్ట్రెయికింగ్ పోలీస్ ఫోర్స్‌నిఘా ఉంటుందన్నారు. సిఆర్‌సి పూర్తయిన వెంటనే పోలింగ్ సీల్ చేయాలని, మైక్రో అబ్జర్వర్ల రిపోర్ట్ పూర్తి చేయాలని తెలిపారు. మార్క్ కాపీ ఆధారంగా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉన్న ఆఖరి వ్యక్తి ఓటు వేసిన తర్వాత పోలింగ్ ముగించాలని తెలిపారు. 12 మే పోలింగ్ సామాగ్రి పంపిణీ కార్యక్రమం చేపట్టనుమన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫ్ చిత్రీకరణ ఉంటుందని ఎన్నికల పోలింగ్ సరళి, నిర్వహణ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించారు. మాక్ పోలింగ్ నుంచి పోలింగ్ ముగింపు వరకు నిర్వహించాల్సిన ప్రక్రియను పవర్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ అవగాహన కల్పించారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అరుకు పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ ఎస్ శోబిక, ఎన్నికల మైక్రో అబిజర్వర్ ల నోడల్ అధికారి జె.ఎల్.ఎన్.మూర్తి, సూక్ష్మ పరిశీలకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాధారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్ద

ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలించిన సాధారణ పరిశీలకులు

ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకులు ప్రమోద్‌కుమార్ మెహర్ద పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంటరీ రిటర్నింగ్ అధికారి నిశాంత్ కుమార్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా ఓటర్లకు అందుతున్న సహకారం, జాబితాలో ఓటరు పేరు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేశారు. అక్కడ నుంచి పోలింగ్ కేంద్రంలోని పోలింగ్ సరళి, బ్యాలెట్ పేపర్లు, కవర్లు పంపిణీ, బ్యాలెట్ బాక్స్ ఏర్పాటును నిశితంగా గమనించారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో మాట్లాడి వసతుల కల్పనపై ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ కల్పించిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వివిధ శాఖల ఉద్యోగులు వినియోగించుకోవాలని పరిశీలకులు అన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

కిల్కారీ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భామిని

కిల్కారీ సేవలను ప్రతి గర్భిణీ వినియోగించుకునేలా ఆశావర్కర్లు పర్యవేక్షించాలని ఇన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి సూచించారు. మండలంలోని బాలేరు, భామిని పిహెచ్‌సిలను మంగళవారం ఆమె సందర్శించారు. అక్కడ నిర్వహించిన ఆశాడే సమావేశంలో ఆమె పాల్గొని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. మాతా, శిశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆశా కార్యకర్తలు నిర్వహించాల్సిన విధులను గురించి సూచనలిచ్చారు. రక్తహీనత, హైరిస్క్ గర్భిణీల ఆరోగ్య సేవల నిమిత్తం తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉపయోగించాలన్నారు. గర్భిణుల ఆరోగ్యాన్ని తరచుగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పిహెచ్‌సిల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఫీడర్ అంబులెన్స్‌ను తనిఖీ చేసి వాటి సేవలపై ఆరా తీశారు. గిరిశిఖర గ్రామమైన బొడ్డగూడలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ దీపిక, డాక్టర్ సోయల్, డెమో యోగీశ్వరరెడ్డి, సబ్ యూనిట్ అధికారి అప్పారావు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేస్తున్న సిపిఎం నాయకులు

అల్లూరి ఆశయ సాధనకు యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి - కొమరాడ

అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు యువత ముందుకు రావాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. కొమరాడలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభ సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సాంబమూర్తి, నాయకులు లక్ష్మ, ఆర్.శివున్నాయుడు, ఉపేంద్ర మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారి చేతిలో వీరమరణం పొందారని, ఆయన పెట్టిన భిక్షతోనే నేడు మనం స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడైన సీతారామరాజు జన్మించిన ఊరిని అభివృద్ధి చేయలేకపోయారని, ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పాలించిన పాలకులు హైటెక్ సిటీ మీద ఉన్న ప్రేమ అల్లూరి సీతారామరాజు ఊరిపై లేకపోవడం విశేషమని అన్నారు. గిరిజన హక్కుల కోసం తమ ప్రాణాన్ని త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు బాటలో గిరిజన యువత ముందుకు రావాలని ఇదే అల్లూరి కి ఇచ్చిన నిజమైన నివాలని నాయకులు అన్నారు. ఇలాంటి సందర్భంలో రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ దిశగా యువతీ యువకులు ముందుకు రావాలని నాయకులు అన్నారు. కార్యక్రమంలో రైతులు గోపినాయుడు, భాస్కరరావు, వెంకటనాయుడు, అప్పలస్వామి, శివున్నాయుడు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా బాలగుడబలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. తొలుత ఆ గ్రామ గిరిజనులు సీతారామరాజు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదం గిరిజనులపై చేస్తున్న దాడులను, దోపిడీని చూసి చలించిపోయిన అల్లూరి సీతారామరాజు గిరిజనుల మధ్యకు వెళ్లి వాళ్లను కూడగట్టి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేయించారని అన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు శ్రీనునాయుడు, భాస్కరరావు, విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడారు. పిడిఎస్ఓ జిల్లా అధ్యక్షులు కె.సోమేష్ , గ్రామ పెద్దలు గౌరందొర, రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం కలిగించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తక్షణమే రద్దు పరచాలని టిడిపి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం రెవెన్యూ అధికారులకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాత ముత్తాతలు, తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూములు, భవనాలు, ఇతర ఆస్తులపై ప్రస్తుత యాజమాన్య హక్కులు అన్యాక్రాంతం కానున్నాయని, దీంతో అన్ని వర్గాల రైతులకు తీవ్రంగా నష్టం కలుగుతుందని అన్నారు. ఈ చట్టంతో రైతులకు చెందిన భూములు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను యజమానులకు అందించకుండా హైకోర్టులోనే అంతిమ పరిష్కారం చూసుకోవాలన్న నిబంధనలతో ప్రజలకు పూర్తిగా నష్టం కలుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ హైకోర్టుకు వెళ్లే స్తోమత ఉండదన్నారు. ఈ చట్టంలో ప్రతిపాదించిన వ్యవస్థ గత ఏర్పాట్లకు సంబంధించిన నియమాలు అధికార పార్టీ కనుసన్నల్లో అధికారులకు పూర్తి అధికారాలు సంక్రమింపజేసి యాజమాన్య హక్కులను అన్యాక్రాంతం చేసేలా ఉన్నాయన్నారు. ఈ చట్టంలో వైసిపి నేతల పరం చేసేందుకు కుట్ర జరిగినట్లుగా కనిపిస్తోందని, కేంద్ర నీతి ఆయోగ్ ప్రతిపాదనలకు పూర్తి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించడానికి పూనుకోవటం దురుద్దేశంగా అన్నారు. ఈ మేరకు ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మండంగి భూషణరావు, వెంపటాపు భారతి, కె.కళావతి, మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశవాణిలో నారంశెట్టి ప్రసంగాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్



పట్టణానికి చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త, ఉత్తరాంధ్ర రచయితల వేదిక అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆకాశవాణి, విశాఖపట్టణం కేంద్రం నుండి ప్రసారం కానున్నాయి. ఇటీవల నారంశెట్టి నాలుగు ప్రసంగాలను ఆకాశవాణి కేంద్రంలో రికార్డు చేశారు. వాటిని ఉదయం 6.30గంట ప్రసారమయ్యే చింతన కార్యక్రమంలో మే 9,11,13,14 తేదీల్లో ప్రసారం చేయనున్నారు. ఈ ప్రసంగాలు ఆకాశవాణి విశాఖపట్టణం కేంద్రంతో బాటు నాలుగు ఎఫ్ఎం రేడియో కేంద్రాల ద్వారా కూడ ప్రసారం చేయనున్నట్టు ఆకాశవాణి తెలిపింది.

ఏనుగుల ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఏనుగుల సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటర్ కంఠనాథరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన కార్యక్రమంలో ఏనుగుల ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసే చర్యల్లో భాగంగా దీనికి సంబంధించిన గోడ పత్రికను జిల్లా అటవీ శాఖ అధికారిని జిఎపి ప్రసూనతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సిబ్బందికి జిపిఎస్ తదితర సాంకేతిక అంశాల గురించి శిక్షణ ఇచ్చారు.



ఎస్‌బిఐ వద్ద పింఛను కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

పింఛన్ల కోసం బ్యాంకుల వద్ద నిరీక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల కోసం మంగళవారం నాటికి వారం రోజులు కావస్తున్నప్పటికీ ఇంకా బ్యాంకుల చుట్టూ జిల్లా కేంద్రం, పట్టణంలో గల బ్యాంకుల వద్ద గంటల కొలదీ క్యూలో నిలబడి పడిగాపులు కాస్తూ ఫించన్ తీసుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకులకు వచ్చిన పింఛనుదారుల అకౌంట్లో లావాదేవీలు జరగక పడకపోవడంతో బ్యాంక్ అధికారులు మీ ఖాతాల్లో లావాదేవీలు జరగకపోవడంతో నిలిచిపోయాయని, మీ ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ , పాన్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకువస్తే మీ ఖాతాను రెన్యువల్ చేయడం జరుగుతుందని చెప్పడంతో పింఛనుదారులు రోజుల తరబడి ఆయా జెరాక్స్ కాపీలను తీసుకొచ్చి బ్యాంకు అధికారులకు అందజేసేందుకు నానా తిప్పలు పడుతున్నారు.

బురదమయంగా రహదారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షానికి రహదారులు బురదమయంగా మారాయి. మండల కేంద్రంలోని గత కొన్నేళ్లుగా పూడికలు తొలగించకపోవడంతో మంగళవారం కురిసిన వర్షం కారణంగా కాలువల్లోని చెత్తతో పాటు మురుగునీరు రహదారులపై ప్రవహించడంతో పాదాచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలకు గురయ్యారు.



పాత బస్టాండ్ రహదారిపై మురుగునీరు



హోం ఓటింగ్ వేస్తున్న వృద్ధురాలు

హోం ఓటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/బొబ్బిలి

జిల్లాలో హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడానికి అవకాశం లేని 85 ఏళ్లు పైబడిన వయో వృద్ధులు, 40 శాతం వికలాంగత్వం దాటిన విభిన్న ప్రతిభావంతులు తమ ఇంటివద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఈ ఏడాది కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చింది. హోం ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించు కోవడానికి 86 మంది వికలాంగులు, 156 మంది వయో వృద్ధులు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల సిబ్బంది వీరి ఇళ్లకు వెళ్లి ఓటు తీసుకొనే ప్రక్రియ మంగళవారం ప్రారంభించారు. సెక్టార్ అధికారుల పర్యవేక్షణలో, పిఒలు, బిఎల్ఒలు, మైక్రో అబ్జర్వర్లు, పోలీసు సిబ్బంది, దరఖాస్తు చేసినవారి ఇంటింటికి వెళ్లి, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో హోమ్ ఓటింగ్ చేయించారు. వారి ఇళ్లలోనే తాత్కాలికంగా పోలింగ్ ఏర్పాట్లు చేసి వారి నుంచి బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేయించారు.

హోం ఓటింగ్ వినియోగించుకున్న ఆరుగురు ఓటర్లు

బొబ్బిలి నియోజకవర్గంలో ఆరుగురు ఓటర్లు హోం ఓటింగ్‌ను వినియోగించు కున్నారు. వీరిలో ఇద్దరు వృద్ధులు, నలుగురు వికలాంగులు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. సాయిశ్రీ ఆదేశాల మేరకు ఎఎల్‌టిఎం జెసి రాజు, పోలింగ్ అధికారులు రమణ, గౌరీశంకర్, నాగభూషణం, భాస్కరరావు, సూక్ష్మ పరిశీలకులు వెంకటేష్ ఓటర్ల ఇంటికి వెళ్లి హోం ఓటింగ్ ద్వారా ఓట్లను సేకరించారు. రామభద్రపురం మండలంలో ఒకరు, తెర్లాం మండలంలో ముగ్గురు, బొబ్బిలి మున్సిపాలిటీలో ఇద్దరు హోం ఓటింగ్ ద్వారా ఓటు వేశారు.



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉద్యోగులు

మూడోరోజు 3638 ఓట్లు నమోదు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు కలిపి మూడోరోజు మంగళవారం 3638 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కున్నారు. జిల్లా మొత్తంగా 18,631 పోస్టల్ బాలెట్లు ఓటర్లు ఉండగా, ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు 14,632 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. విజయనగరం నియోజకవర్గ కేంద్రానికి సంబంధించి జెఎన్‌టియు కేంద్రంలో మంగళవారం 1020 మంది, గజపతినగరంలో 497మంది, బొబ్బిలిలో 569 మంది, నెల్లిమర్లలో 378 మంది, రాజాంలో 391 మంది, ఎస్.కోటలో 477 మంది, చీపురుపల్లిలో 306 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతర జిల్లాలకు చెందిన 2467 మంది ఉద్యోగులు ఇప్పటివరకు బ్లాక్ 1లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

బొబ్బిలి : నియోజకవర్గంలో 2,339మందికి ఓటుహక్కు ఉండగా 2,161మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొదటిరోజు 749, రెండోరోజు 843, మూడోరోజు 569మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ పరిశీలించారు.

రేపు కురుపాంలో చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 9న గురువారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాం వస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ తెలిపారు. రావాడ కూడలిలో ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించనున్నట్లు తెలిపారు. అనంతరం సాయిబాబా గుడి ఎదురుగా మైదానం వద్ద చంద్రబాబు హెలీపాడ్ దిగనున్న స్థలాన్ని సిబిఎన్ టూర్ కమిటీ సభ్యులతో పరిశీలించారు.

నాకు నువ్వు... నీకు నేను..

- అన్నిచోట్లా అవగాహన రాజకీయాలే
- ప్రజలను మభ్యపెడుతూ.. సమస్యలను దాటవేస్తూ ప్రచారం
- ఎన్నికల వేళ అభ్యర్థుల తీరు
- ప్రత్యామ్నాయమే ప్రజల దారి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల తీరు నాకు నువ్వు... నీకు నేను అన్నట్టుగా ఉంది. మధ్యలో ఓటర్లే వెర్రిబాగులవారు అనుకుంటున్నారేమో. బహుశా అందుకేనేమో...! పార్టీలు వేరైనా పరస్పర అండర్ స్టాండింగ్‌తో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజక వర్గాల్లో దీర్ఘకాలంగావున్న కీలక ప్రజా సమస్యలపై గానీ, నెరవేరని హామీలపైగానీ విర్శలుచేయడం లేదు. ఎంతసేపూ తమ అధినేతలు ప్రకటించిన పప్పు బెల్లాలాంటి సంక్షేమ పథకాల కోసమే చెప్పు కుంటున్నారు. పరస్పరం తమ ఆర్థిక మూలలను, రాజకీయ అస్థిత్వాలను దెబ్బతీసు కోకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రజల్ని మభ్యపెడుతూ ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. విజయనగరంలో టిడిపికి చెందిన అశోక్ గజపతిరాజు ఆధీనంలోవున్న మాన్సాస్ లెక్క తేలుస్తామన్న స్థానిక ఎమ్మెల్యే వీరభద్రస్వామి, ఇతర వైసిపి పెద్దలు కీలకమైన ఎన్నికల ఘట్టంలో నేడు నోరు మెదపడం లేదు. నోరు మెదిపితే వీరభద్రస్వామి కబ్జాలకు పాల్పడుతున్నాడంటూ ఊదరగొట్టిన అశోక్, ఆయన కూతురు టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి వాటిని బయటపెట్టేందుకు ఇప్పుడు ఎందుకు వెనుకాడుతున్నారు. ఇదీ విజయనగరంలో ముమ్మరంగా సాగుతున్న చర్చ. అటు గజపతినగరం మండలం కోరపు కొత్తవలస ప్రజానీకం నిన్నగాక మొన్న భూముల అక్రమ కొనుగోలు, క్రయ, విక్రయాలు, చెల్లింపులపై స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యను నిలదీశారు. ఇది కేవలం ఆ ఊరిలో మాత్రమే కాదని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అప్పలనర్సయ్య అడ్డగోలుగా భూములు వశపర్చుకున్నారని నియోజకవర్గ వాసులు ఆరోపిస్తున్నారు. సాక్షాత్తు టిడిపి నాయకులు కూడా చెప్పుకుంటున్నారు. దానిపై స్థానిక టిడిపి అభ్యర్థి ఇప్పటి వరకు నోరు మెదపలేదు. ఇందుకు ప్రతిఫలంగా టిడిపిలోని గ్రూపు రాజకీయాలు తదితరాలపై ఎమ్మెల్యే కూడా మాట్లాడడం లేదు. గజపతినగరం తోటపల్లి బ్రాంచి కెనాల్ ఎందుకు పూర్తిచేయలేదో కూడా టిడిపి ఎమ్మెల్యే ప్రశ్నించలేదు. ఈ నియోజకవర్గం పరిధిలోవున్న భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ తెరిపిస్తామని మాత్రం ఎక్కడా చెప్పడం లేదు. రైతుల్ని ఆదుకుంటామని మాత్రం ప్రసంగాలు ఊదర గొడుతున్నారు. ఇటీవల ఎస్.కోట వచ్చిన చంద్రబాబు కూడా భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని ఎలా తెరింపించాలన్నది ఆలోచిస్తామంటూ చేతులు దులుపుకున్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే స్థానిక జ్యూట్ మిల్లులు ఎందుకు తెరిపించలేదో టిడిపి అభ్యర్థి బేబీ నాయన ప్రశ్నించడం లేదు. నియోజకవర్గానికి తోటపల్లి నీరు, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమల స్థాపనపై ఇద్దరూ ప్రస్థావించడం లేదు. రూ.24కోట్లతో చింతపల్లి తీరంలో ఏడాది క్రితం తలపెట్టిన మత్స్యకార ఫ్లోటింగ్ జట్టీ ఎందుకు పూర్తిచేయలేదో, గడిచిన ఐదేళ్లలో తారకరామకు తగినంత నిధులు కేటాయించలేదో జనసేన అభ్యర్థి మాట్లాడడం లేదు. వైసిపి అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు మిరాకిల్ విద్యాసంస్థలపై వచ్చిన భూ ఆక్రమణల ఆరోపణలపై ప్రశ్నించడం లేదు.

సాలూరు నియోజకవర్గంలో కుడుమూరు భూములు, మెంటాడలో అటవీ భూముల ఆక్రమణలపై అక్కడి ఎమ్మెల్యే అభ్యర్థులిద్దరూ కిమ్మనడం లేదు. పార్వతీపురంలో జరిగిన భూదందాలపై అక్కడి టిడిపి అభ్యర్థి నోరు వినిపించడం లేదు. కురుపాం నియోజకవర్గంలోని పూర్ణపాడు-లాబేసు వంతెన పైనా, గిరిశిఖర గ్రామాల్లో విద్య, వైద్య సదుపాయాలు, నాన్ షెడ్యూల్ గ్రామాల్లోని గిరిజనుల వెతలు తదితర సమస్యలపై టిడిపి, వైసిపి అభ్యర్థులు కనీసం మాట వరసకు కూడా ప్రస్తావన లేదు. పాలకొండ, రాజాం, తదితర నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. దీంతో, ఒకరి అస్థిత్వాన్ని ఒకరు కాపాడుకుంటూ ఎన్నికల్లో జనాల్ని మభ్యపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మొన్న వైసిపి.. నిన్న టిడిపి

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ఎరుకులవీధికి చెందిన 30 కుటుంబాలు మొన్న వైసిపిలో చేరగా తాజాగా టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఆపార్టీలో చేరిన వారికి మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు కండువాలు వేసి ఆహ్వానించారు. మాజీ కౌన్సిలర్ గొర్లె అంకులు మాట్లాడుతూ తమ వీధిలో జరగనున్న వారాలు పండగ ఖర్చులకు విరాళం కోసం వైసిపి కార్యాలయానికి వెళ్తే వైసిపి కండువాలు వేశారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు పని చేస్తామని చెప్పారు.

ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నుంచి ఒక రోజు ఒక పార్టీ, మరుచటిరోజు మరో పార్టీలోకి మారుతున్న పరిస్థితులు ఉన్నాయి. పార్వతీపురం, విజయనగరం, సాలూరు,ఎస్.కోట నియోజకవర్గాల్లో ఎక్కువ మంది ఇలా పార్టీలు మారారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లను మభ్య పెట్టేందుకు ఆయా పార్టీల నాయకులు ఈ తరహా ప్రచారానికి శ్రీకారం చుట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకం

- బూత్‌ల వద్ద కనీస సౌకర్యాలను తనిఖీ చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పోలింగ్ బూత్‌ల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుండి పూర్తయ్యేవరకు ప్రతి అంశాన్ని పరిశీలించిరిపోర్ట్ ను సాధారణ పరిశీలకులకు పంపవలసి ఉంటుందని స్పష్టం చేశారు. పిఒలకు, ఎపిఒలకు, ఎంఒలకు ఇప్పటికే మూడుసార్లు శిక్షణ పూర్తి చేశామని, తప్పిదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు తలేత్ పర్వేజ్ ఇక్బాల్, హనీష్ చాబ్రలతో కలిసి కలెక్టర్ శిక్షణా కార్యక్రమంలో సూక్ష్మ పరిశీలకుల విధులను, బాధ్యతలను గురించి వివరించారు.సూక్ష్మ పరిశీలకులంతా 12వ తేదీన ఉదయం నియోజకవర్గం స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో రిపోర్టు చేయాలని, ముందుగా పోలింగ్ స్టేషన్ పరిధి లో కనీస సౌకర్యాలను తనిఖీ చేసి సాధారణ పరిశీలకులకు నివేదిక నివ్వాలని తెలిపారు. పోలింగ్ రోజున ఉదయం 5.30గంటలకే మాక్‌పోల్ ప్రారంభించాలని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు క్యూలో ఉన్నవారికి స్లిప్పులు ఇచ్చి పోలింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. నిబంధనల మేరకు ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ బూత్‌లో ఎన్నికల సిబ్బంది, పోలింగ్ ఏజెంట్‌లు ఎవరికి కేటాయించిన సీట్లలో వారు కూర్చోవాలని తెలిపారు. పోలింగ్ బూత్ లోనికి వచ్చిన ఓటర్లతో ఏజెంట్లు కాకుండా ఎన్నికల సిబ్బంది మాత్రమే మాట్లాడాలని సూచించారు. లోపలకు మొబైల్ ఫోన్ లను అనుమతించరాదని, పార్టీ గుర్తులు, రంగులు, కండువాలు, జెండాలు వంటివి ఉండకూడదని స్పష్టం చేసారు. పోలింగ్‌బూత్‌కు 100 మీటర్ల దూరం లోపల ఎలాంటి ప్రచారం జరగకూడదని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఆర్ఒ ఇవిఎం క్లోజ్ బటన్ తప్పని సరిగా ప్రెస్ చేయాలని తెలిపారు. ఓటింగ్ ప్రక్రియ ను వెబ్ కాస్టింగ్ , వీడియో గ్రఫి చేస్తారని, పోలింగ్ ఏజెంట్‌లు అభ్యర్థికి ఒక్కరు మాత్రమే బూత్‌లో ఉండాలని, మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఏజెంట్ రిలీవర్ ఉండకూడదని స్పష్టం చేసారు. మీడియా వారికి ఎన్నికల కమిషన్ జారీ చేసిన అథారిటీ లెటర్ ఉంటేనే అనుమతించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ సుధాకర్ రావు ఓటింగ్ విధానం , ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్లైండ్ ఓటు , బిలో ఏజ్ , రిజక్టు ఓటు తదితర ఓట్లను ఎలా వేయాలనే అంశాలను పిపిటి ద్వారా వివరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ అనిత, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్ర, పర్వేజ్